క్లుప్తంగా

నేడు బండలాగుడు పోటీలు



పెబ్బేరు రూరల్: రంగనాథస్వామి జాతర సందర్భంగా శ్రీరంగాపురంలో బుధవారం నిర్వహించనున్న అఖిల భారత ఒంగోలు జాతి బండలాగుడు పోటీల ఏర్పాట్లను మంగళవారం హనుమాన్ యూత్ నాయకులు పరిశీలించారు. ఈ పోటీల నిర్వహణకు అన్ని వసతులు కల్పించాలని రైతు సంఘాల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ మందాడి చిదంబర్‌రెడ్డి, హరిప్రసాద్, కమిటీ అధ్యక్షుడు, జర్లు కాళ్ల రాఘవేందర్‌శెట్టి, రాజుల శివ, గంగాధర్‌యాదవ్, సంపత్‌నాయుడు, దాసరి కృష్ణ, నరేష్‌నాయుడు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



కొత్తకోట: హోలీని పురస్కరించుకొని మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీ కోటి లింగేశ్వర ఆలయంలో మంగళవారం ఆదిదంపతులు అయిన శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

గట్టుకాడిపల్లిలో ప్రత్యేక పూజలు



ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి ఆలయానికి ప్రతి నెల 7వ తేదీన మండలం నుంచి ఎంతోమంది భక్తులు వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. అదేవిధంగా స్వామివారు స్వయంభుగా వెలిసిన గట్టుకాడిపల్లి ఆలయానికి మండలంలోని పలు గ్రామాలతో పాటుగా వనపర్తి తదితర పట్టణాల నుంచి భక్తులు ప్రతి నెల 7వ తేదీన వచ్చి దర్శనం చేసుకుంటున్నారు.

సీసీ వేశారు.. క్యూరింగ్ మరిచారు



అమరచింత: పట్టణంలో రూ.3.5 కోట్లతో చేసిన సీసీ రహదారుల నిర్మాణాల్లో సంబంధిత కాంట్రాక్టర్ క్యూరింగ్‌ను చేపట్టలేకపోతున్నాడని, దీంతో నెర్రలు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీసీ రహదారుల నిర్మాణ సమయంలో సంబంధిత ఏఈ లేకపోవడంతో ఇసుకకు బదులుగా అధికంగా డస్ట్‌ను ఉపయోగించి నిబంధనలకు విరుద్ధంగా రహదారులను నిర్మిస్తున్నారు. వార్డుల్లో పూర్తయిన రహదారికి కనీసం వారం రోజులు కూడా క్యూరింగ్ చేయట్లేదు. మరికొన్ని వార్డుల్లో సీసీ రహదారులపై ఏర్పాటు చేసిన కరకట్టల మధ్య నీటి జాడే లేకపోవడం ఇందుకు నిదర్శమని ప్రజలు మండిపడుతున్నారు. పట్టణంలో పదికాలల పాటు ఉండాల్సిన సీసీ రహదారులు క్యూరింగ్ సరిగ్గా లేని కారణంగా త్వరలోనే దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి క్యూరింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కొత్తకోట: సీపీఎస్‌ను రద్దు చేస్తేనే ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని, లేకుంటే ఉద్యమం చేపడతామని పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని పీఆర్టీయూ టీఎస్ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగే హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సూర చంద్రశేఖర్, కరీంనగర్, సరూర్‌నగర్ టీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడు భక్తరాజ్, సూర సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు సునీల్‌కుమార్, బాల్‌రాజు, లక్ష్మయ్య, సంఘం సభ్యులు మిద్దె సత్యనారాయణ, గోవిందు పాల్గొన్నారు.





పామిరెడ్డిపల్లిలో..



జంగమాయపల్లిలో..



బ్రాహ్మణగారి వీధిలో..

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా యువకులు కోలాటాలు, మహిళలు బొడ్డెమ్మలు వేస్తూ కామయ్య పాటలు పాడారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు హోలీ శుభాకాంక్షలు చెప్పారు. యువత రోడ్లపైకి వచ్చి రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం మైక్‌సెట్లు ఏర్పాటు చేసి ప్రధాన వీధుల గుండా నృత్యాలు చేస్తూ ర్యాలీ తీశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, సీఐ రత్నం, ఎస్‌ఐలు నాగశేగర్‌రెడ్డి, శివనాగేశ్వర్‌నాయుడు, రామన్‌గౌడ్, నాగన్న, ఎంపీపీలు గుంత మౌనిక, శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పీజే బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



పెబ్బేరులో హోలీ సంబురాలు చేసుకుంటున్న యువత



అమరచింతలో..



మదనాపురంలో..



వీపనగండ్లలో..



అమరచింతలో..



అమరచింతలో..



తెల్లరాళ్లపల్లితండాలో గిరిజనుల నృత్యాలు



పాన్‌గల్‌లో..



కొన్నూరు బుడగజంగాల కాలనీలో..



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..



వనపర్తి పట్టణ వర్తక సంఘం ఆధ్వర్యంలో..



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

ఖిల్లాఘనపురం: మండలంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీహరి హెచ్చరించారు. సోమవారం రాత్రి గుట్టల నుంచి ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని ఓ వెంచర్‌కు ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను ఆయన పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. మంగళవారం హోలీ పండుగ ఉన్నందున మైనింగ్ అధికారులు బుధవారం వచ్చి చర్యలు తీసుకుంటారన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం వెల్టూర్ శివారులో గల వాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో సోమవారం రాత్రి తరలిస్తుండగా ప్రాథమిక సమాచారం మేరకు కాపు కాసి పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఆర్థికసాయం అందజేత

చిన్నంబావి: లక్ష్మీపల్లికి చెందిన గోవుల వెంకటస్వామి రెండు వారాల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులు దహన సంస్కారాల కోసం రూ.15వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అల్లూరి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ స్వామినాయుడు, ముష్టి తిరుపాలు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాంబాబు, ఇటిక్యాల మహేశ్, బొల్లు బీముడు, వెంకట్ నారాయణ, ఎద్దుల మహేశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు చిన్నయ్య, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: పట్టణంలోని 15వ వార్డుకు చెందిన అబ్దుల్ వహీద్(52) పెద్దమందడి మండలంలోని మోజర్ల వద్ద సోమవారం రాత్రి ఇసుక ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పొగాకు విశ్వేశ్వర్ రూ.2 వేలు, 15 వార్డు యూత్ అధ్యక్షుడు ఎండీ సాధిక్ రూ. 2వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో వారం రోజుల క్రితం మరణించిన మీసాల పుష్పమ్మ కుటుంబానికి మంగళవారం అదే గ్రామానికి చెందిన ఇంద్రకంటి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వీరి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఛారిటబుల్ ట్రస్టు కమిటీ సభ్యులు ఇంద్రకంటి శేఖర్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మీసాల మోహన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మీసాల కుర్మయ్య, చిన్నయ్య, నాగరాజు, ఈశ్వరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్లు డిపో దగ్ధం

అమరచింత: పట్టణ శివారులోని ఓ గుడిసెలో ఏర్పాటు చేసిన కల్లు డిపో దగ్ధమైన సంఘటనలో రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు వాపోయారు. పట్టణానికి కల్లు సరఫరా చేసే కల్లు డిపోను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగలపెట్టి ఉంటారని నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కల్లు డిపోలో కల్లు తయారు చేసి వాటిని ఖాళీ సీసాల్లో నింపుకొని పట్టణంలోని కల్లు పాకకు తరలిస్తుంటామని నిర్వాహకుడు అక్కల నరసింహులుగౌడ్ తెలిపారు. కల్లు డిపో నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించిన ఎస్‌ఐ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తగులపెట్టారా.. లేదా షార్ట్‌సర్క్యూట్‌తో తగలబడిందా అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

బోరు మోటార్ల దొంగల హల్‌చల్



మోటార్‌ను ఎత్తుకెళ్లగా మిగిలిన పైప్, వైర్ (ఫైల్)

వీపనగండ్ల: మండలంలో కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ పొలాల వద్ద అమర్చుకున్న మోటార్లను గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్తడడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు అనే రైతు మోటారు జూరాల డిస్ట్రిబ్యూటర్ కెనాల్ నెంబర్ 28 పై ఏర్పాటు చేసుకోగా దొంగలు ఎత్తుకెళ్లారు. నెల క్రితం గోవర్ధనగిరికి చెందిన నాగయ్య మోటార్ పెబ్బేరు మండలం అయ్యవారిపల్లికి చెందిన వ్యక్తి తీసుకెళ్తుండగా గుర్తించిన రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా అతడిపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. అయినా దొంగతనాలకు పాల్పడే వ్యక్తుల్లో మార్పు రాలేదు. మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలగొండలో 5 మోటార్లను వారం రోజుల క్రితం దుండగులు చోరీ చేశారు. అలాగే 10 రోజులుగా నిత్యం మోటార్లు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నంబావి, పెబ్బేరు, శ్రీరంగాపురం, పాన్‌గల్, వీపనగండ్ల పోలీస్ అధికారులు సమష్టిగా నిఘా ఉంచి మోటార్ల దొంగలను గుర్తించాలని మండల రైతులు వెంకటయ్య, రాముడు, శివాజీ, కుర్మయ్య, బాలస్వామి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పట్టణమంతా నిఘా నేత్రాలు



గాంధీచౌరస్తాలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ రత్నం

అమరచింత: మున్సిపాలిటీలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు పట్టణ శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఆత్మకూర్ సీఐ ఎస్‌కే రత్నం తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు ఇతర ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గతంలో 20 సీసీ కెమెరాలను బిగించామన్నారు. ప్రస్తుతం వీటిలో కొన్ని మరమ్మతుకు చేరుకున్నట్లు గుర్తించామన్నారు. ఐదు నెలల క్రితం పోలీస్‌స్టేషన్‌ను టెలిఫోన్ ఎక్చేంజీ భవనంలోకి మార్చడంతో సీసీ కెమెరాలకు సంబంధించిన కమ్యూనికేషన్ వైరింగ్ ఏర్పాటు ఆలస్యమైందని తెలిపారు. పట్టణంలో మొత్తంగా 26కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో సైతం వీటిని అమర్చుతామన్నారు. అక్రమ వ్యాపారం, చోరీలకు పాల్పడటం వంటి సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా తమ సిబ్బంది తెలుసుకునేందుకు ప్రత్యేక వాచ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వ్యాపారస్తులు సహకరించాలి

పట్టణంలోని వ్యాపారస్తులు తమ దుకాణ సముదాయల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. ప్రధాన వ్యాపార, దుకాణదారుల వివరాలను సేకరించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వారికి పోలీస్ శాఖ ద్వార నోటీసులు అందించాలని ఎస్‌ఐకి ఆదేశించారు. పట్టణంలో నిఘా వ్యవస్థ బలోపేతం కోసం పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమోషన్లు, బదిలీల్లో పారదర్శకత



కొత్తకోట: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ బలపరిచిన ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి కోరారు. పట్టణ కేంద్రంలో మంగళవారం ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయుల ఇళ్లకు ఆయన వెళ్లి ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన ఏవీఎన్ రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, ఉద్యోగుల జీత భత్యాలు సకాలంలో చెల్లించాలన్నా, పీఆర్సీ, డీఏలు సకాలంలో ఉద్యోగులకు అందించాలన్నా, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను ప్రవేశ పెట్టాలన్నా, వార్షిక క్యాలెండర్‌ను ప్రవేశపెట్టి పారదర్శక బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నా, 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలన్నా ఏవీఎన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, కొమ్ము భరత్‌భూషణ్, మాధవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పబ్బ నరేందర్‌గౌడ్, ఉపాధ్యాయకులు ఆకుల వెంకటయ్య, రాఘవేంద్రచారి తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

వీరారెడ్డి సేవలు చిరస్మరణీయం



మదనాపురంలో వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్: ఆప్కాబ్ మాజీ చైర్మన్, అమరచింత మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి సేవలు చిరస్మరనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు గణేష్‌ముదిరాజ్, వెంకటన్న, ఖాజన్న, హరీష్‌గౌడ్, మధు, ఈర్లదిన్నె శ్రీను, మన్యం, షబ్బీర్, బుచ్చన్న, నిరంజన్, గాండ్ల రఘు, బషీర్ తదితరులు ఉన్నారు.

పేదల కోసం నిరంతరం పోరాటం

మదనాపురం: నాటి అమరచింత నియోజకవర్గంలోని పేదలకు అండగా ఉంటూ అభివృద్ధి కోసం పరితపించిన గొప్ప నేత మాజీ ఎమ్మెల్యే, ఆప్కాబ్ మాజీ చైర్మన్ వీరారెడ్డి మాత్రమేనని, ఆయన తుదిశ్వాస వరకు పేదల కోసం పోరాడిన గొప్ప నాయకుడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ కొనియాడారు. మండల కేంద్రంలో మంగళవారం వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామచంద్రయ్య మాదరి, సత్యశీలారెడ్డి, వేమన్న రాఘవేంద్రయాదవ్, అంజద్, విజయ్, బాలకృష్ణ, రాముడు, గోవిందు, వెంకటేష్, నాగన్న, రాములు ఖాజామైనోద్దీన్, చెట్ల సాయిలు, చిన్నారెడ్డి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మాయలో పిల్లలను బలి చేయొద్దు

పాన్‌గల్: కార్పొరేట్ విద్యా వ్యవస్థ మాయలో పడి చదువుల కోసం పిల్లలను అందులో చేర్పి వారి జీవితాలను ఛిద్రం చేయొద్దని ట్రస్మా జిల్లా అధికార ప్రతినిధి పత్తికొండ కర్ణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనే ఆశయంతో అనవసర ఒత్తిడికి గురికి చేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ వంటి నగరంలోని పేరు మోసిన కార్పొరేటు సంస్థల్లో రూ.లక్షల ఫీజులు చెల్లించి వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలకు కార్పొరేటు సంస్థలు, తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు ఇప్పటికైనా పిల్లలను ఒత్తిడికి గురి చేసే విధానికి స్వస్తి పలికి వారి ఇష్టానికి అనుగుణంగా చదివించాలని కోరారు. పిల్లలు ప్రశాంత వాతావరణంలో పెరిగే అవకాశం ఇవ్వాలన్నారు.

ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో రైతు తలకంటి రవీందర్‌రెడ్డికి సంబంధించిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశువుల మేత కోసం గ్రామ సమీపంలో తన పశువుల కొట్టంలో భద్రపర్చిన 10 ట్రాక్టర్ల వరి గడ్డి, 5 ట్రాక్టర్ల వేరుశనగ పొట్టుకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు. వారు జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు చుట్టు పక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపు చేసినా.. పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. దీని విలువ దాదాపుగా రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైందా? లేక ఎవరైనా నిప్పు పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

రామన్‌పాడుకు 1,017 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తి నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడుమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 97 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.